
మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## కొల్చారంలోని రేణుకమాత ఆలయంలో చోరీ..

**కొల్చారం, జనవరి 11, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన కొల్చారంలోని శ్రీరేణుకమాత ఆలయంలో శుక్రవారంరాత్రి దొంగలుపడ్డారు. ఆలయమండపంలోకి ప్రవేశించి ఎస్ఎస్ డోర్‌ను పగులగొట్టి, గుడి ప్రధానద్వారాన్ని ధ్వసంచేసి హుండీలోని నగదును, అమ్మవారి రెండు ముక్కుపుడకలను దోచుకెళ్లారు. ఎస్ఐ మహమ్మద్‌గౌస్ తెలిపిన వివరాల ప్రకారం ఎస్ఎస్ డోర్, ప్రధానద్వారం తాళం పగులగొట్టి లోపలికివెళ్లిన దొంగలు మండపంలోని హుండీని ఆలయానికి కొద్దిదూరం వరకు తీసుకెళ్లారు. తాళం పగులగొట్టి అందులోని నగదును దోచుకెళ్లారు. గౌడసంఘం సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ తెలిపారు. క్లూస్‌టీమ్ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. ఆలయంలోని అన్ని సిసి కెమెరాల ఫుటేజీని పరిశీలించగా ఆలయ మండపంలోని సిసి కెమెరాలో దొంగతనం జరిగిన తీరు రికార్డు అయ్యింది. ఒక్క వ్యక్తి తలుపులు పగులగొట్టి హుండీని తీసుకెళ్తున్న దృశ్యం సిసి కెమెరాలలో స్పష్టంగా నమోదైంది.

## సమస్యకు పరిష్కారం కావాలి మిషన్ భగీరథ కార్మికుల ధర్నా

**హత్నూర, జనవరి 11, ప్రభాతవార్త:**
హత్నూర మండలం బోర్పట్ల మిషన్ భగీరథ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద పనిచేస్తున్న కార్మికులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఐదు నెలలుగా తమకు జీతాలు చెల్లించడం లేదని బిఆర్‌సి కాంట్రాక్టు కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం వెంటనే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐదు నెలల వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం 18000 అమలు చేయాలని డిమాండ్ చేశారు.
కార్యక్రమంలో సిఐటియు మెదక్ జిల్లా మిషన్ భగీరథ యూనియన్ అధ్యక్షులు జక్కుల బాబయ్య, లక్ష్మణ్, కుమారస్వామి, రాజు, రవి, నవీన్ విష్ణు, విష్ణువర్ధన్, సత్యనారాయణ, రవీందర్, శ్రీకాంత్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌నేతలకు షాక్ ఇచ్చిన అటవీశాఖ అధికారులు

**హత్నూర, జనవరి 11, ప్రభాతవార్త:**
నర్సాపూర్ నియోజకవర్గ అధికార కాంగ్రెస్‌పార్టీ నాయకులకు అటవీ శాఖ అధికారులు షాకిచ్చారు. అధికారులచర్యలతో కాంగ్రెస్‌పార్టీ నాయకులు తాముపాల్గొనాల్సిన కార్యక్రమాన్ని రద్దుచేసుకోవాల్సి వచ్చింది. ఈవిషయం హత్నూరమండలంలో చర్చనీయాంశమైంది. హత్నూరమండలం షేర్‌ఖాన్‌పల్లి గ్రామపరిధిలోని కలుగుమీది నల్లపోచమ్మ ఆలయ కమిటీ నూతనపాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవం గురువారం నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాటుచేసుకున్నారు. ఈకార్యక్రమానికి మెదక్‌జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, మెదక్ డిసిసి అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్‌నాయకులు నీల,మధు తదితరులు హాజరు కావలసి ఉంది. అటవీభూమిలో అక్రమంగా రేకులషెడ్లు వేశారంటూ అటవీశాఖ అధికారులు గురువారం తెల్లవారుజామున జెసిబి ఇతర యంత్రాలసహాయంతో సుమారు 20షెడ్లను కూల్చివేశారు. ఆందోళనకు దిగారు. స్థానికంగా పరిస్థితులు ఉద్రిక్తంగా ఉండటంతో పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవానికి హాజరుకావలసిన అధికారపార్టీ నాయకులు పర్యటన రద్దుచేసుకున్నారు. దీనితో కాంగ్రెస్‌పార్టీశ్రేణులు తీవ్రనిరాశకు గురయ్యారు. ఆధికారిక కార్యక్రమం ఉందని తెలిసి కూడా, అధికారపార్టీ నాయకులను పట్టించుకోకుండా, అటవీశాఖ అధికారులు షెడ్లుకూల్చడానికి పూనుకోవడం, చర్చనీయాంశమయ్యింది. బాధితులు శుక్రవారం ఆలయంముందు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు.

## కలెక్టరేట్లో ఘనంగా ఒడ్డె ఓబన్న జయంతి వేడుకలు



ఒడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 11, ప్రభాతవార్త:**
జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బ్రిటిష్ నిరంకుశపాలనకు వ్యతిరేకంగాపోరాడిన మహనీయ స్వాతంత్ర్యసమర యోధుడు ఒడ్డె ఓబన్న జయంతివేడుకలు శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాకలెక్టర్ క్రాంతి వల్లూరు ముఖ్యఅతిథిగా హాజరై ఒడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులు అర్పించి, ఆయనసేవలను స్మరించుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో ఒడ్డె ఓబన్నపాత్ర అత్యంతప్రభావవంతమైందని గుర్తుచేశారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ చంద్రశేఖర్, సహాయ బిసి సంక్షేమాధికారి కె.భాగ్యలక్ష్మి, జిల్లా వడ్డెరసంఘం అధ్యక్షులు వరికుప్పల లింగయ్య, సంఘంనాయకులు పల్లపు అంజయ్య, విఎంఎల్ చక్రవర్తి, శ్రీనివాస్,జైరాం,ఆంజనేయులు,వివిధసంఘాల నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



అభివృద్ధిపనులకు శంకుస్థాపనచేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**అమీన్‌పూర్, జనవరి 11, ప్రభాతవార్త:**
శరవేగంగా అభివృద్ధిచెందుతున్న అమీన్‌పూర్ మున్సిపల్‌పరిధిలో మౌలికవసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం సంగారెడ్డిజిల్లా అమీన్‌పూర్ మున్సిపల్‌పరిధిలోని వివిధకాలనీలలో కోటిరూపాయల విలువైన అభివృద్ధిపనులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితోపాటు మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నందారం నరసింహగౌడ్‌లు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధిచెందుతున్న అమీన్‌పూర్ మున్సిపల్‌పరిధిలో మౌలికవసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. 8లక్షలరూపాయల నిధులతో రెండు అంగన్వాడీకేంద్రాలను రెనోవేట్ చేసిన కోకోకోలసంస్థను అభినందించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## అల్ప్రాజోలం తయారీ ముఠాసభ్యుల అరెస్టు





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రుపేష్

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 11, ప్రభాతవార్త:**
అల్ప్రాజోలం తయారుచేసి విక్రయిస్తున్న ముఠాసభ్యులను అరెస్టు చేసినట్టు సంగారెడ్డిజిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. శనివారం సంగారెడ్డిలోని జిల్లాకార్యలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లడుతూ గుమ్మడిదల పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును పరిశోధించిన పోలీసులు, సిసిఎస్ పోలీసులు ఇప్పటికే 350 గ్రాముల అల్ప్రాజోలంను పట్టుకుని ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. వీరికి సరఫరాచేస్తున్న ముఖ్య సరఫరాదారునితోపాటు, నలుగురిని అరెస్టుచేసి వారినుండి 740గ్రాముల అల్ప్రాజోలంను, మూడు కార్లు, 6సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, నిందితులు కూడబెట్టిన 60 కోట్ల ఆస్తులను గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. ఈకేసులో మొత్తం 17మంది భాగస్వామ్యం ఉన్నట్లు నిర్ధారించామని, అందులో ఇప్పటికే ముగ్గురిని అరెస్టుచేయడం జరిగిందని, ప్రస్తుతం ఐదుమందిని అరెస్టు చేశామని మిగతా వారు పరారీలో ఉన్నారని తెలిపారు. మత్తుపదార్థాలబారిన పడవద్దని యువతను ఎస్పీ కోరారు.
మీపరిసర ప్రాంతాలలో ఏదైనా అనుమానిత, రహస్యకార్యకలాపాలు జరుగుతు న్నట్లు గుర్తించినట్లైతే వెంటనే 87126567777 నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. పటాన్‌చెరువు డియస్పి రవీందర్‌రెడ్డి, సిసియస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, జిన్నారం ఇన్స్పెక్టర్ నయీముద్దీన్, గుమ్మడిదల ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి, సిసియస్ ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలు ఆపేదిలేదు

**-సాగులో ఉన్న ప్రతీ ఎకరాకు రైతు భరోసా అందిస్తాం**
**-ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎలాంటి పైరవీలు ఉండవు**
**-కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీలో మంత్రి పొన్నం ప్రభాకర్**





మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, జనవరి 11, ప్రభాతవార్త:**
రాష్ట్ర ఆర్థికపరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నా ప్రజలకు సంక్షేమపథకాలను ఆపేదిలేదని రాష్ట్రరవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.శనివారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో నియోజకవర్గంలోని 7 మండలాలకుచెందిన కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్దిదారులు మంజూరైన 330చెక్కులను పంపిణీచేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకివచ్చాక 200 యూనిట్ల ఉచితవిద్యుత్, 500లకే గ్యాస్ సిలెండర్, రైతులకు 2లక్షల రుణమాఫీ, సన్నవడ్లకు రూ.500ల బోనస్, ఆరోగ్యశ్రీని 5లక్షల నుండి 10లక్షలకు అమలు చేయడంతోపాటు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడినా గత ప్రభుత్వాలు అమలుచేసిన పథకాలనుసైతం అమలుచేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లసర్వే దాదాపు పూర్తయిందని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎలాంటి పైరవీలులేకుండా అర్హులకే ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. అంతేకాక, రాష్ట్రంలో గతప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా ఎకరాకు రూ.5వేలు ఇస్తే దానిని రూ.6 వేలకు పెంచినట్లు వివరించారు. భూమిలేని కూలీలకు రూ.12వేలు ఈనెల 26నుండి ఇవ్వబోతున్నామన్నారు. అర్హులందరికీ నూతన రేషన్‌కార్డులతోపాటు మరిన్ని కొత్త కార్యక్రమాలు తీసుకొస్తామని, ఆర్టిసికి సంబంధించి మహిళాసంఘాల ద్వారా మరో 600బస్సులను కొనుగోలు చేయబోతున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటిసమస్య ఉన్నా తనదృష్టికి తీసుకురావాలని సమస్యలను స్వయంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు పట్టణంలోని 1,2,10,14,16వ వార్డుల్లో పలు అభివృద్ధికార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యానికి, వ్యవసాయానికి నామొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. గౌరవెల్లి, మిడ్‌మానేర్, మల్లన్నసాగర్‌కు సంబంధించి నిర్వాసితులపై అక్రమకేసులను ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించినట్లు వివరించారు. అనంతరం మార్కెట్‌యార్డులో సంక్రాంతిపండగను పురస్కరించుకుని మహిళలువేసిన ముగ్గులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లాగ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, వైస్‌చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు, మార్కెట్‌కమిటీ చైర్మెన్ కంది తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మెన్ బంక చందు, ఆర్డీవో రాంమూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్, నియోజకవర్గ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# టిజిఐఐసి భూమికి రాజకీయ గ్రహణం

**భూమికి అనుమతులివ్వరు, మ్యుటేషన్ చేయరు**
**కోర్టు ఆదేశాలు బేఖాతర్: తెరవెనుక చీకటినేత ఎవరు?**



మాట్లాడుతున్న టిజిఐఐసి జోనల్‌మేనేజర్ రతన్‌రాథోడ్

**పటాన్‌చెరు, జనవరి 11, ప్రభాతవార్త:**
టిజిఐఐసి అధికారులతీరుపై సర్వత్రా విమర్శలు. ఒక నాడు వందలు, వేలకోట్లు పెట్టుబడి పెడదామని పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చినా అనుమతుల కోసం కార్యాలయాలచుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సిన పరిస్థితి. తమవద్ద పెట్టుబడులు పెట్టండంటూ గతప్రభుత్వం పారిశ్రామిక అనుమతులు సులభతరం చేసేదిశగా టిఎస్ఐపాస్ ప్రారంభించింది. టిఎస్ఐపాస్ (తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టం) పేరు ప్రపంచ పారిశ్రామిక రంగంలో తెలంగాణాను అగ్రగామిగా నిలిపిందని సగర్వంగా చెప్పుకున్న గతప్రభుత్వం టిజిఐఐసిలో పేరుకుపోయిన అవినీతితిమింగలాలను మాత్రం అలాగే వదిలేసింది. పటాన్చెరు ఐడిఏ ఫేజ్2లో 833,834,836, 837,838 సర్వేనంబర్లలో లక్ష్మీ క్లే, సాయి ఆటోమేటిక్ బ్రిక్స్‌లకుచెందిన 5.14 ఎకరాల భూమిని 17 జూలై, 1993న ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ (ఎపిఎస్ఎఫ్‌సి) నుండి ఆక్షన్ ద్వారా ఎంఎస్ లైట్ క్రియేట్ కనస్ట్రక్షన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ కొనుగోలు చేసింది. తరువాత ఎంఎస్ శ్రీనిధి ఇండస్ట్రీస్‌యాజమాన్యం 11మే, 2006లో 15.04ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. దీనికై అప్పట్లో ఏపీఐఐసీ 3ఫిబ్రవరి, 2006న సంగారెడ్డి సబ్‌రిజిస్ట్రార్‌కు 15.14ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయాల్సిందిగా ఎన్వోసీ కూడా అందజేసింది. మ్యుటేషన్‌కోసం పటాన్‌చెరు టిజిఐఐసి కార్యాలయం గడపతొక్కిన ఎంఎస్ శ్రీనిధి ఇండస్ట్రీస్‌యాజమాన్యానికి అప్పటి జోనల్‌మేనేజర్ దరఖాస్తు సక్రమంగా సమర్పించాలని చెప్పడంతో సదరు శ్రీనిధి యజమాన్యానికి విషయం అర్థంకాలేదు. మరోసారి మ్యుటేషన్ కోసం పటాన్‌చెరు టిజిఐఐసి కార్యాలయంలో సంప్రతించగా పైఅధికారులతో మాట్లాడుకోవాలని సూచించారని శ్రీనిధి యజమాన్యం తెలిపింది. అక్కడ పైవాళ్ళు ఎవరో తమకు అర్థంకాలేదని శ్రీనిధి యాజమాన్యం తెలిపింది. ఈభూమి టిజిఐఐసి చెందినదంటూ బోర్డు ఏర్పాటుచేయడం విచిత్రమని హైకోర్టును ఆశ్రయించింది. గతసంవత్సరం డిసెంబర్ 11,18తేదీలలో జోనల్ మేనేజర్ తనసిబ్బందితో వచ్చి ప్రహరీని కూల్చివేయడం, ఈవిషయంలో జోనల్‌మేనేజర్ అత్యుత్సాహం చూపడంతో శ్రీనిధిసంస్థయజమానులు జిల్లాకలెక్టర్, ఎస్పీకి సైతం ఫిర్యాదుచేశారు. పటాన్చెరు పోలీస్‌స్టేషన్‌లో శ్రీనిధి ప్రతినిధులు సమర్పించిన డాక్యుమెంట్లు నిశితంగా పరిశీలించిన అధికారులు అన్నీ సక్రమంగానే ఉన్నాయని, కోర్టు ఆదేశాలుండగా ఎలా కూలగొట్టారని తాము రాకుండానే కూలగొట్టడం వెనక ఆంతర్యమేమిటని వారు ప్రశ్నించినట్టు సమాచారం. రాజకీయ ఒత్తిడి ఉందని పలువురు చెప్పడంవెనుక చీకట్లో ఉన్న ఆరాజకీయనేత ఎవరో చెప్పాలని శ్రీనిధిసంస్థయజమానులు ప్రశ్నిస్తున్నారు. పరిశ్రమకు బేస్మెంట్,ఫెన్సింగ్ విషయంలో టిజిఐఐసి అనుమతులు ఇవ్వకపోగా, శ్రీనిధియాజమాన్య స్థలంలోకి ప్రవేశించి ఇబ్బందులకు గురిచేయవద్దని హైకోర్టుచెప్పినా అధికారులు తమవైఖరి విడనాడకుండా యథాతథంగా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పూర్తి ఆధారాలతో తాము హైకోర్టుకు జరిగిన విషయాన్ని వివరిస్తామని బాధితులు తెగేసి చెప్పారు. రతన్‌రాథోడ్‌ను వివరణకోరగా శ్రీనిధికి సంబంధించిన భూమివిషయంలో సబ్‌డివిజన్ చేసుకోవాలని అందుకే అభ్యంతరం తెలుపుతున్నామని తెలిపారు. 2006లోనే ఈభూమికి సబ్‌డివిజన్ అయ్యింది కదా అని విలేకరులు అడిగినప్రశ్నకు మళ్లీసబ్‌డివిజన్ చేసుకోవాలని చెప్పడం గమనార్హం. గతంలో శ్రీనిధి యజమాన్యానికి ఎన్‌ఓసి ఎలా ఇచ్చారని ప్రశ్నించగా అప్పట్లో అధికారుల తప్పిదం అని ఆయన పరోక్షంగా అంగీకరించారు. శ్రీనిధి యజమాన్యభూమిపై అందరిదృష్టి ఉందని చెబుతూనే మాపై ఎటువంటి రాజకీయ ఒత్తిడిలేదని చెప్పడం కొసమెరుపు. 120 ఎకరాలు అప్పటి ఏపీఐఐసీ విక్రయించగా 25 ఎకరాలకు మాత్రమే డబ్బు చెల్లించారన్నారు. డబ్బు చెల్లించని మిగతాభూమి కేటాయింపులు రద్దుచేశామని ఈ మేరకు సుప్రీంకోర్టులో కూడా కేసు గెలిచామన్నారు.

# గ్రామ, వార్డు సభల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

**-లబ్దిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి**
**-అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 11, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేయనున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకాలకు సంబంధించి ఈనెల 21నుండి 24వరకు పంచాయతీల పరిదిలో గ్రామసభలను, మున్సిపల్ పట్టణాలలో వార్డుసభలను పక్కాగా నిర్వహించాలని జిల్లాకలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. గణతంత్రదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26నుండి పైపథకాలను అమలుచేయాలని ప్రభుత్వంసంకల్పించిన నేపథ్యంలో, చేపట్టాల్సిన చర్యలపై సంబంధితశాఖల అధికారులకు కలెక్టర్ శనివారం సమావేశం ఏర్పాటుచేసి దిశానిర్దేశం చేశారు. రైతుభరోసాపథకం కింద ప్రభుత్వం పట్టా పాస్ పుస్తకాలు కలిగిన రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లను కలుపుకొని ప్రతియేటా ఎకరానికి రూ.12,000చొప్పున నేరుగా వారిఖాతాలలో నగదు జమచేయనుందని తెలిపారు. భూభారతి(ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయయోగ్యమైన భూమివిస్తీర్ణం ఆధారంగా రైతుభరోసాపథకం కింద అర్హులైనవారిని గుర్తించాలని సూచించారు. క్షేత్రస్థాయి సందర్శన జరిపి భూమి వ్యవసాయానికియోగ్యమైనదా? కాదా? అని నిర్ధారించాలని అన్నారు. మండలస్థాయిలో తహసీల్దార్, మండలవ్యవసాయాధికారి నేతృత్వంలో కమిటీని ఏర్పాటుచేసుకోవాలని, అలాగే గ్రామస్థాయిలో వ్యవసాయవిస్తీర్ణ అధికారులు,రెవెన్యూ అధికారులతో కమిటీలను నియమించుకుని విలేజ్‌మ్యాప్, గూగుల్‌మ్యాప్ ఆధారంగా వ్యవసాయయోగ్యమైన భూములను నిర్ధారించాలని కలెక్టర్ సూచించారు. ఈనెల 20వతేదీ లోపు క్షేత్రస్థాయిసందర్శన ప్రక్రియను పూర్తిచేయాలని గడువువిధించారు. 21 నుండి 24వతేదీవరకు నిర్వహించే గ్రామసభలలో వివరాలను వెల్లడిస్తూ, గ్రామసభ ఆమోదంపొందిన మీదట సంబంధిత పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. సాగుభూమిలేని వ్యవసాయకూలీ కుటుంబాలకు సాలీనా 12వేలరూపాయలు అందించేందుకు ఉద్దేశించిన ఇందిరమ్మ ఆత్మీయభరోసాపథకానికి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో అర్హతకలిగిన కుటుంబాలను గుర్తించాలన్నారు. 2023-24 సంవత్సరంలో కనీసం 20రోజులపాటు ఉపాధిహామీ పనులుచేసిన వ్యవసాయకూలీకుటుంబాలు ఆత్మీయభరోసాపథకానికి అర్హులని కలెక్టర్ సూచించారు. లబ్దిదారులగుర్తింపులో ఎంపీడీవోలు, ఏపీవోలు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. కొత్త ఆహారభద్రత (రేషన్) కార్డులు జారీచేసే విషయంలోనూ క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వనిబంధనలకు లోబడి తలసరి ఆదాయం, భూమి కలిగి ఉన్న కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులను అందించడమే కాకుండా, పాతకార్డులలో మార్పులుచేర్పులనుసైతం చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఎక్కడ కూడా డూప్లికేట్, డబుల్ రేషన్‌కార్డులు జారీకాకుండా పకడ్బందీ పరిశీలనచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లపథకానికి సంబంధించికూడా ప్రభుత్వమార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. గ్రామసభలను నిర్దేశితగడువులోపు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈసమావేశంలో అదనపుకలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పిడి డిఆర్డిఏ జ్యోతి, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, పిడి హౌసింగ్ ఆర్డీవోలు సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అట్టడుగువర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 11, ప్రభాతవార్త:**
ప్రభుత్వ సంక్షేమపథకాలు జిల్లాలో పకడ్బందీగా అమలుచేసేందుకు జాబితాప్రక్రియ వేగవంతంచేయాలని జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత కలెక్టరేట్‌కార్యాలయంలో శుక్రవారం రాష్ట్రముఖ్యమంత్రి కలెక్టర్‌ల కాన్ఫరెన్స్‌లో చర్చించిన సంక్షేమపథకాలు జిల్లాలో అమలుచేసే విధివిధానాలపై అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లపథకంసర్వే జిల్లాలో 96 శాతం కంప్లీట్ చేయడం జరిగిందని, అర్హతగల నిజమైన లబ్దిదారులకు పకడ్బందీగా అమలుచేసేదిశగా చర్యలుచేపట్టాలన్నారు. అర్హులైననిరుపేదలకు ఇళ్లుకేటాయించే ప్రక్రియను కూడా వేగవంతం చేయాలన్నారు. ప్యూరిఫికేషన్‌ప్రక్రియ 16వతేదీనుంచి ప్రారంభించి 20వతేదీనాటికి పూర్తిచేయాలన్నారు. 16వతేదీనుండి 18వతేదీవరకు ఫీల్డ్‌పనులు పూర్తిచేసి, 19వతేదీనాటికి కార్యాలయంలో సమీక్షజరిపి, తుదిజాబితాను 20వతేదీకి సమర్పించాలన్నారు. 21వతేదీనుంచి 24వతేదీ వరకు గ్రామసభలు నిర్వహించి తుదిజాబితా ప్రకారం లబ్దిదారులను ఖరారుచేయాలన్నారు. ప్రతిమండలాన్ని రెండుభాగాలుగా విభజించి, ప్రతిభాగానికి డిప్యూటీ తహసీల్దార్‌ను బాధ్యతవహించేలా నియమించాలని, డేటాను సక్రమంగా సమీక్షించి సరైన పద్ధతిలో సర్వేను పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు జయచంద్రారెడ్డి, రమాదేవి, మైపాల్‌రెడ్డి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డిఆర్డీవో శ్రీనివాస్, డిపివో యాదయ్య, డిఎస్‌వో సురేష్, అగ్రికల్చర్ అధికారి వినయ్, హౌసింగ్ పిడి మాణిక్యం, హౌసింగ్ డీఈలు, ఈఈలు, ఎంపీడీవోలు, వ్యవసాయశాఖ ఏడీలు, ఏవోలు పాల్గొన్నారు.

# 'తైబజార్' అడ్డగోలు వసూళ్లు..!

**టేక్మాల్, జనవరి 11, ప్రభాతవార్త:**
నగ్రామాల్లో వారాంతపుసంతలు ఏర్పాటు చేసుకొని గ్రామాభివృద్ధికి దానికి సంబంధించిన వేలంపాట నిర్వహించి తైబజార్ నిర్వహిస్తారు. అందుకుగాను కొందరు తైబజార్ వేలంపాటలో అంగడినిర్వాహకుల దగ్గర గ్రామకమిటీ నిర్వహించిన సభలో వివరించినవిధంగా డబ్బులు వసూలుచేయాల్సి ఉంటుంది. తైబజార్ నిర్వాహకులు ఇష్టానుసారంగా వసూలుచేస్తే చర్యలు తీసుకుంటాం అంటూ హెచ్చరించి మరీ తైబజార్‌ను అప్పగిస్తారు. అదేంపట్టకుండా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తూ వ్యాపారులను కొనుగోలుదారులను ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిసింది. పశువులను కొనుగోలుచేసిన, అమ్మిన వ్యక్తుల దగ్గర ముక్కుపిండి అధికంగా వసూలు చేస్తున్నట్లు తెల్సింది. ఇదేమనిప్రశ్నించేవారు లేకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నామంటూ కొనుగోలుదారులు భోరున విలపిస్తున్నారు. అంగట్లో అన్నీ ఉన్నా, అల్లుడినోట్లో శని అన్నచందంగా అంగడికి ఆదాయం ఉన్నప్పటికీ సౌకర్యాలుమాత్రం కల్పించడంలో అటు అధికారులు సంబంధితపాలకులు వెనుకబడ్డారని చెప్పొచ్చు. ఒక కూరగాయల దుకాణానికి 15 రూపాయలుండగా 100రూపాయల వరకు, వేరేషాప్‌కు హోటల్‌కు 150, మేకకు 15 ఉంటే 150రూపాయలు, బర్రెకు25, ఎద్దుకు25 రూపాయలు,250నుండి 500రూపాయల వరకు కోడి, మేక, గొర్రె,బర్రె,ఎద్దు అనేతేడా లేకుండా, అడ్డూఅదుపులేకుండా రశీదులు ఇవ్వకుండా తైబజార్ వసులు చేస్తున్నారు. నిర్వాహకులు ఎద్దుకు, మేకకు, గొర్రెకు, అవుకు రశీదు 15 రూపాయలుంటే ఏకంగా వాటి పక్కన సున్ననుజోడించి అందినకాడికి దండుకోవడం పరిపాటిగా మారింది. కొనుగోలుదారులు భోరుమంటున్నారు. తైబజార్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా డబ్బులువసూలు చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





వేలంలో నిర్ణయించిన వివరాలు

## ఉరి వేసుకొని వ్యక్తి మృతి

**జోగిపేట, జనవరి 11,ప్రభాతవార్త:**
గత కొద్దిరోజులుగా మానసికపరిస్థితి బాగోలేక కృంగిపోయిన ఓ వ్యక్తి ఉరివేసుకొని మృతిచెందిన సంఘటన జోగిపేటలో శనివారం జరిగింది. ఇందుకుసంబంధించి పోలీసులుతెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగిపేటకుచెందిన నర్రా రాజశేఖర్ మానసికంగా బాధపడుతూ శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందాడు. అతని భార్య మమతఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని జోగిపేట ఎస్ఐ పాండు తెలిపారు.

## ట్రాక్టర్ కిందపడి బాలుడి మృతి

**జోగిపేట, జనవరి 11,ప్రభాతవార్త:**
ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి ఓ బాలుడు మృతిచెందిన సంఘటన శనివారం జోగిపేట బస్టాండువద్ద శనివారంసాయంత్రం జరిగింది. జోగిపేట ఆర్టీసిబస్టాండు ముందరగావస్తున్న ట్రాక్టర్‌కింద ఓబాలుడు అకస్మాత్తుగాపడిపోవటంతో బాలుడు మృతిచెందాడు. మృతిచెందిన బాలుడి మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాసుపత్రిలో ఉంచారు. ఇతనికి సంబంధించి వివరాలు తెలియకపోవటంతో అతన్ని గుర్తుపట్టినవారు జోగిపేట పోలీసులను సంప్రతించాలని జోగిపేట ఎస్ఐ పాండు తెలిపారు.

## వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాప్రసాద నివేదన

**సిద్ధిపేట అర్బన్, జనవరి 11, ప్రభాతవార్త:**
పట్టణకేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి పాత దేవస్థానంలో శనివారం ఆలయ మహిళాగోష్ఠి ఆధ్వర్యంలో మహాప్రసాద నివేదన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఆదివారం ఉదయం 10గంటలకు ఆలయంలో గోదారంగనాయకకళ్యాణం ఉంటుందని కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలన్నారు.

## మండల అధ్యక్షునికి సత్కారం



మండల అధ్యక్షున్ని సత్కరిస్తున్న నాయకులు

**అక్కన్నపేట, జనవరి 11, ప్రభాతవార్త:**
భారతీయ జనతా పార్టీ అక్కన్నపేటమండల అధ్యక్షునిగా రెండవసారి ఎన్నికైన రామంచ మహేందర్‌రెడ్డిని పార్టీనాయకులు,కార్యకర్తలు శనివారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహేందర్ రెడ్డి పార్టీకిచేసిన సేవలను పార్టీ గుర్తించిందని తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం వల్లే రెండవసారి ఏకగ్రీవంగా ఎంపిక చేయడం సంతోషకరమైన విషయమన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు వేణుగోపాల్‌రావు, నునావత్ మోహన్‌నాయక్, తిరుపతినాయక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

**సిద్ధిపేట రూరల్, జనవరి 11, ప్రభాతవార్త:**
గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్‌ప్రభుత్వ ధ్యేయం అని కాంగ్రెస్‌పార్టీ సిద్ధిపేట నియోజకవర్గ ఇంచార్జీ పూజల హరికృష్ణ అన్నారు. శనివారం నియోజకవర్గంలోని నారాయణరావుపేట మండలకేంద్రంలో అంగన్‌వాడీ భవనంకు రూ.8లక్షలు, దేవక్కపల్లిలో డ్రైనేజీ నిర్మాణానికి 10లక్షలు కోదండరపుపల్లి గ్రామంలో సిసిరోడ్డు నిర్మాణానికి రూ.5లక్షల ఈజీఎస్ నిధులతో అభివృద్ధి పనులకు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పట్టణాలతోపాటు ప్రతి గ్రామాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కాలిముద్దీన్, బుచ్చిరెడ్డి, పాండు, లక్ష్మీ, రాజవీర్, రాములు, బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయకమిటీ చైర్మన్ కరుణాకర్, కార్యదర్శి బాబీష్, సదాశివరెడ్డి, రమేష్‌గౌడ్, వనజ, సంతోష, ఉమాదేవి, లతారెడ్డితోపాటు తదితరులు ఉన్నారు.

## హక్కుల సాధనకు ఐక్య పోరాటం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సిద్ధిపేట, జనవరి 11, ప్రభాతవార్త ప్రతినిధి:**
మున్నూరుకాపుల హక్కులసాధనకై ఐక్యపోరాటం చేయాలని మున్నూరు కాపుసంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పిలుపునిచ్చారు. శనివారం రోజున సిద్ధిపేట ప్రెస్‌క్లబ్‌లో సంఘం నూతన క్యాలెండర్‌తో పాటు డైరీని ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దేవయ్యతో పాటు పాల సాయిరాం హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికసంఖ్యలో ఉన్న మున్నూరుకాపులకు రాజ్యాధికారం రావడంలేదని, అందరూ కలిసికట్టుగా ఉండడంతోపాటు జాతిని ఏకంచేసి ఐక్యపోరాటాలు చేసి హక్కులను సాధించుకోవాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరుకాపులను గ్రామగ్రామానా గెలిపించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు నాయకం మల్లయ్య, అధ్యక్షులు సొప్ప పూర్ణచంద్రశేఖర్, ప్రధానకార్యదర్శి సతీష్‌కుమార్, నాయకులు ఎల్లం నారాయణ, వెంకటరాజ్యం, హరికిషన్, శ్రీధర్, శ్రీనివాస్, యాదగిరి, మహేందర్, యశ్వంత్, భాను, ఆహన్, శ్రావణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మాలపల్లిలో ఉచిత వైద్యశిబిరం




మాలపల్లిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, జనవరి 11, ప్రభాతవార్త:**
మండలంలోని మాలపల్లిగ్రామంలో శనివారం బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఇంచార్జ్ జ్యోతి, కోఆర్డినేటర్లు శ్రీమతి నిర్మలల పర్యవేక్షణలో లక్ష్మీనరసింహ హాస్పిటల్ హన్మకొండవారు గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో దాదాపు 100 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, సిబ్బంది స్రవంతి, కృష్ణవేణి, సుభాష్‌తో పాటు గ్రామవాటర్‌ప్లాంట్ సభ్యురాలు వెన్నశారద,గ్రామస్థులు ప్రమీల,కమలవ్వ, భూలక్ష్మి,రాజేశ్వరి,లతతోపాటు తదితరులు ఉన్నారు.

## నవభారత్ పాఠశాలలో ముందస్తు సంక్రాతి వేడుక

**హుస్నాబాద్‌టౌన్, జనవరి 11, ప్రభాతవార్త:**
పట్టణంలోని నవభారత్ ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో శనివారం ముందస్తు సంక్రాంతివేడుకలను పాఠశాల కరస్పాండెంట్ గంగరవేణి రాజు, ప్రధానోపాధ్యాయులు చింతకింది శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థినీవిద్యార్థులకు ముగ్గులపోటీలు నిర్వహించగా వారు వివిధరంగులతో ముగ్గులువేసి అందరిని అలరించారు. ఈపోటీల్లో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల అధ్యాపకబృందంతో కలసి అభినందించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆనందోత్సహాల మధ్య జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకబృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలి

**-మహిళాసంఘాల గౌరవం పెరిగేవిధంగా క్యాంటిన్‌లు నడవాలి**
**-రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



మహిళాశక్తి క్యాంటిన్ ప్రారంభిస్తున్న మంత్రి

**హుస్నాబాద్‌టౌన్, జనవరి 11, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళాసంఘాల ద్వారా ఏర్పాటుచేసిన ఇందిరామహిళాశక్తి క్యాంటీన్‌లలో ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాలోని మున్సిపల్‌కాంప్లెక్స్‌లో మహిళాశక్తి క్యాంటిన్ ద్వారా పల్లెరుచులు ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా క్యాంటిన్‌లో వివిధ ఆహారపదార్థాలను ఆయన రుచి చూశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మహిళాసంఘాల ద్వారా ప్రారంభించిన ఈక్యాంటిన్‌లలో మంచి ఆహారాన్ని అందిచడం వల్ల మహిళా సంఘాల గౌరవం పెంచేవిధంగా నడపాలన్నారు. మహిళాసంఘాల సభ్యులు ఎదగడానికి ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. సంఘాలసభ్యులు ఇలాంటి కార్యక్రమాలను ఉపయోగించుకోవాలన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆర్టీసిలో 600ల బస్సులను మహిళాసంఘాల ద్వారానే కొనుగోలు చేస్తున్నామని, అంతేకాకుండా సోలార్, కోళ్లపెంపకం, పట్టుపరిశ్రమలు, లాంటివి కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈసంక్రాంతినుండి అక్కాచెల్లెలు అంతా ఉజ్వల భవిష్యత్తు ఉండేలా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, వైస్‌చైర్మెన్ అనిత శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు, సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రాంమూర్తి, తహసీల్దార్ రవిందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ గౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే కాంగ్రెస్‌ప్రభుత్వ ధ్యేయం

**-కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్**

**టేక్మాల్, జనవరి 11, ప్రభాతవార్త:**
నిరుపేదలసంక్షేమ, ఆరోగ్యమే కాంగ్రెస్ ధ్యేయం అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ అన్నారు. టేక్మాల్ గ్రామాల్లోని నిరుపేదప్రజల సంక్షేమమే, కాంగ్రెస్‌పార్టీ ధ్యేయమని టేక్మాల్ మండలపార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్ తెలిపారు. శనివారం టేక్మాల్‌లో 31మంది లబ్దిదారుల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులపంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు రూ.11.64లక్షల 31చెక్కులు పంపిణీచేసినట్లు తెలిపారు. నిరుపేదలకు సిఎంఆర్‌ఎఫ్ ఓ వరంగా మారిందని తెలిపారు. ప్రభుత్వపథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో ప్యాక్స్ డైరెక్టర్ అకులపల్లి పాపయ్య, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు మజహర్ పాల్గొన్నారు.

## మంత్రి దృష్టికి చక్రియాల్ సమస్యలు



మంత్రి దామోదర్‌కు సమస్యలను వివరిస్తున్న అందోలు కృష్ణ

**చౌటకూరు, జనవరి 11, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని చక్రియాల్ గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి సి.దామోదర్‌ను చక్రియాలగ్రామ మాజీ సర్పంచ్, సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు అందోలు కృష్ణ వినతిచేశారు. శనివారం హైద్రాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని మంత్రి దామోదర్ నివాసంలో కృష్ణ మంత్రిని కలుసుకుని పూలబొకేను అందించి ముందస్తుగా సంక్రాంతిపండగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలోని శ్రీలక్ష్మీఅనంతపద్మనాభస్వామి ఆలయంవరకు 20లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంటు రహదారి పనులు పూర్తయినట్లు కృష్ణ మంత్రి దృష్టికి తీసుకుపోయారు. ఆలయానికి కొత్త పాలకవర్గం ఏర్పాటు చేసినందుకు మంత్రికి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాన్ని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కృష్ణ మంత్రి దామోదర్‌కు వినతిచేశారు.

## బోదకాలు నివారణలో సహకరించాలి

**సైదాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** బోదకాలు వ్యాధినివారణలో ప్రజలందరు సహకరించాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో శంకేశ్వర్ బజార్‌లో బోధకాలు వ్యాదినిర్ధారణ సర్వే నిర్వహించారు. సర్వేలోభాగంగా వైద్యశాఖసిబ్బంది స్థానికంగా రక్త నమూనాలను సేకరించారు. సర్వేను పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ కొత్తకాపు అరుణ మాట్లాడుతూ బోధకాలు వ్యాధినిర్ధారణకోసం రక్త నమూనాలను రాత్రి 8నుంచి 12గంటల వరకే సేకరి స్తారని, ఆ సమయంలోనే వ్యాధి కారకాలు గుర్తించబడుతాయని అన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మహేష్, నరేష్, ఆశా వర్కర్లు సంధ్య, అనూష, కవిత, సుష్మ, బిజెపి నాయకులు గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ స్కూల్‌లో ఘనంగా సంక్రాంతి వేడుకలు

**ఉప్పల్, జనవరి 11, ప్రభాతవార్త :** బోడుప్పల్‌లోని కాకతీయ టెక్నోస్కూల్‌లో శనివారం సంక్రాంతిసంబరాలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ అనంతరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకల్లో విద్యార్థులు హరిదాసు కీర్తనలు, యశోధ వేషదారణలతో ఆకట్టుకున్నారు. భోగిమంటలు వేసి రంగురంగుల ముగ్గులుపోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్నకు ఘన నివాళి

**అడ్డగుట్ట, జనవరి 11, ప్రభాతవార్త:**
గెరిల్లా యుద్ధాన్ని నడిపిన యోదుడు వడ్డే ఓబన్న ఆశయసాధన కోసం పనిచేస్తామని వడ్డెర సంఘం ప్రతినిధి గోగుల స్వామి అన్నారు. స్వాతంత్ర సమరయోదుడు వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా శనివారం తుకారంగేట్ రియోపాయింట్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వరికొప్పుల శ్యామ్, గణేష్, ఎల్లయ్య, సంతోష్‌కుమార్, రాజేష్, స్వామి, శ్రీను, శివకుమార్, వెంకటేష్, యాదగిరి, రమేష్, నర్సింహ్మా, స్వామి, ఉదయ్ యాదవ్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్

**-ముఖ్యఅతిధిగా హాజరైన జనగామ ఎమ్మెల్యే పళ్ల రాజేశ్వర్‌రెడ్డి**

**కొమురవెల్లి, జనవరి11,ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రోజున మండలస్థాయి వాలీబాల్‌పోటీలను జనగామ ఎమ్మెల్యే పళ్ల రాజేశ్వర్‌రెడ్డి,గ్రామ మాజీసర్పంచ్‌లు, బిఆర్ఎస్‌నాయకులు, కార్యకర్తలతోకలసి ప్రారంభించారు. బిఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొంగు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈపోటీలకు మండలవ్యాప్తంగా 11గ్రామాల నుండి 22జట్లు హాజరయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి క్రీడలను ప్రారంభించి వారిని పరిచయం చేసుకున్నారు. ప్రారంభమైన పోటీలో కొమురవెల్లి మాజీసర్పంచ్ సార్ల లతకిష్టయ్య టాస్ వేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలస్థాయిలో ఈవాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిని ప్రత్యేకంగా అభినందించారు.వారు చేస్తున్న సేవాకార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తాజామాజీ జడ్పిటిసి సిలువేరు సిద్దప్ప, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కిష్టయ్య,ఏర్పుల మహేష్,గొల్లపల్లి ఆంజనేయులు,కొండ శ్రీధర్,తలారి కిషన్, వంశి,రహిందర్‌రెడ్డి,స్వామితోపాటు మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## భారీ అలంకరణతో అష్టలక్ష్మి దేవాలయం

**ఎల్.బి.నగర్, జనవరి 11, ప్రభాతవార్త:** వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా వైష్ణవదేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మిదేవాలయంలో ఆదిలక్ష్మిసమేత శ్రీమన్నారాయణడిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆదిలక్ష్మిసమేత శ్రీమన్నారాయణడిని దర్శించుకునేందుకు తెల్లవారుజామునుంచే వేలాదిమందిభక్తులు గంటలతరబడి క్యూలైన్‌లో నిలబడ్డారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని అష్టలక్ష్మిదేవాలయం పూలతో భారీగా అలంకరణచేశారు. విద్యుత్‌కాంతులతో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. దేవాలయంలో దర్శనంచేసుకున్న వేలాదిమందిభక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.

## విజ్ఞాన్ స్కూల్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**ఉప్పల్, జనవరి 11, ప్రభాతవార్త:** రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లోని విజ్ఞాన్‌జ్యోతి హైస్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు రంగురంగుల ముగ్గులవేసి గొబ్బెమ్మలను పెట్టి వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో పండుగవాతావరణం కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలచైర్మన్ వేములకొండ సోమశేఖర్‌గౌడ్, ప్రిన్సిపల్ వేములకొండ రేణుక, ఉపాధ్యాయులు మాసన, కృష్ణవేణి, దమయంతి, దీప చిన్నారులను భోగిపళ్లతో ఆశీర్వదించారు. హరిదాసు వేషధారణలతో కీర్తనలు అలపించారు. కోలాటం, ఆటపాటలతో చిన్నారులు తమప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు పాఠశాలలో పతంగులు ఎగురవేసి ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి, శ్రీలత, నాగలక్ష్మి, జ్యోతి, మమత, సమీనా, అరుణాదేవి, అంభికా, చందన, నవనీత,శ్రావణి, స్వాతి, శ్రీనివాసారావు, హరికృష్ణ, నరసింహ, గణేష్ పాల్గొన్నారు.

## లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా పెస్ట్ వేడుకలు


**ఉప్పల్, జనవరి 11, ప్రభాతవార్త:** ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీకళాశాలలో శనివారం ఎల్ఎఫ్‌ఫెస్ట్-2025 ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ బ్రదర్ రెవ. అరుణ్‌ప్రకాష్, డైరెక్టర్ రెవ.బ్రదర్‌జాన్, ప్రిన్సిపల్ జయంతిరెడ్డి జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రభావశీలులైన గౌరవ్‌రెడ్డి, ఈశ్వర్ బోలేగర్, ఆరోగ్య పరిరక్షణ గురించి వివరించారు. నేపద్య గాయకుడు రితీష్‌రావు తన గానామృతంతో ఆహుతులను ఆకట్టుకున్నారు. లవ్ యు ఫాధర్ మూవీ టీం, బిగ్‌బాస్ రన్నరప్ గౌతమ్ కృష్ణ, సోలోబాయ్ మూవీలను చిత్రబృందం ఆలరించారు. ఈ కార్యక్రమంలో జే మ్యూజిక్ బాండ్, స్వాడ్‌లో లైవ్ మ్యూజిక్, పన్‌గేమ్, ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## పాడిరైతుల సమస్యలను పరిష్కరించాలి

**ఘట్‌కేసర్, జనవరి 11, ప్రభాతవార్త:**
పాడిరైతులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకరమైన చర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ అంకుశాపూర్‌లోని విజయ పాలసేకరణ కేంద్రాని న్ని శనివారం ఆయన సందర్శించి పాడిరైతులు, కేంద్రం నిర్వహకులను తెలుసుకున్నారు. వీరి సమస్యలపై జిల్లా పాడి పరిశ్రమ అధికారి దృష్టికి తీసుకువెళ్లిన సందర్భంగా వారితో చర్చించారు. రైతులు సాగుకు ప్రత్యాహ్నాయంగా అనుబంధ ఉపాధి అవకాశాలు పాడిపరిశ్రమ ద్వారా పాల ఉత్పత్తి ఉంటుందన్నారు. ఈరంగాన్ని కూడా వెన్ను విరుస్తూ పాలకు ఆరేడు విడతలుగా డబ్బులు చెల్లించకుండా పాడి రైతులను మనోవేధనకు గురిచేస్తున్నారని ఆయన విమర్శించారు.

# ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి

**ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్**



టేక్మాల్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతి ఇస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**టేక్మాల్, జనవరి 11, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ డిమాండ్ చేశారు.శనివారం టేక్మాల్ బస్టాండ్ నుండి మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు నల్లా బ్యాడ్జిలు ధరించి టేక్మాల్ గ్రామంలో పురవీధుల గుండా పాదయాత్ర చేస్తూ భారీ ర్యాలీగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు ఇస్తానన్న భరోసా,15,000 రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణ మాఫీ, మహిళలకు 2500 ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటిలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల తరువాత ఇచ్చిన హామీలు మరిచి ప్రజలను, రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. ప్రశ్నించిన ప్రతిపక్షాలపై కేసులు పెట్టిన రేవంత్ రెడ్డి సర్కారు భయపెడుతున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టిన బిఆర్ఎస్ పార్టీ రైతుల ప్రజల పక్షాన నిలబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు జైపాల్‌రెడ్డి, టేక్మాల్ మండల పార్టీ అధ్యక్షులు వీరప్ప, మాజీ చైర్మెన్ నాగభూషణం, టేక్మాల్ సొసైటీ చైర్మెన్ యశ్వంత్‌రెడ్డి, మండల యువ నాయకులు భాస్కర్, మాజీ ఎంపిటీసీ సిద్దయ్య,మాజీ కో అప్షన్ సభ్యులు సలీం,రవి,రమేష్,గోవిందచారి, శ్రీనివాస్, హన్మగౌడ్, వెంకట్‌గౌడ్, నారాయణ, బన్నయ్య, మల్లేశం, మాణిక్యం, సలావోద్దీన్, సాయిబాబలతో పాటు రైతులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభం



క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

**కొల్చారం, జనవరి 11, ప్రభాతవార్త:**
కొల్చారంమండలంలోని పలుగ్రామాల్లో శనివారం క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. పైతర గ్రామంలో పిపిఎల్ సీజన్-2, సంగాయిపేటలో ఎస్పీఎల్ సీజన్-5 క్రికెట్‌పోటీలు ప్రారంభమయ్యాయి. పైతర గ్రామంలో జరుగుతున్న క్రికెట్ పోటీలకు బిఆర్ఎస్ యువ నాయకుడు యాబన్నగారి రవితేజారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యువకుడు సమరసింహారెడ్డి, గ్రామ మాజీ ఎంపీటీసీ ఆదాం, ఎల్లేశంలు విజేతలకు అవసరమైన ప్రైజ్‌మనీ, బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి సహకారం అందిస్తున్నారు.

## తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని



రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌గౌడ్‌ను కలిసిన పుట్ట నర్సింగరావు

## కలిసిన మండల పార్టీ అధ్యక్షుడు

**గుమ్మడిదల, జనవరి 11, ప్రభాతవార్త:**
హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్‌గౌడ్‌ను శనివారం గుమ్మడిదల మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు ఆధ్వర్యంలో ఉమ్మడిమండల కాంగ్రెస్‌నాయకులు కలిసి శాలువతోసత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధికార్యక్రమాలను చర్చించడం జరిగిందని వారు తెలిపారు. ఈసందర్భంగా పుట్ట నర్సింగరావు మాట్లాడుతూ గత 10సంవత్సరాల కాలంలో గతప్రభుత్వం చేసిందేమీ లేదని, తమ కాంగ్రెస్‌ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి 6గ్యారెంటీలతో ఒక్కొక్కటిగా అమలుచేస్తూ అభివృద్ధిపథంలోకి తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఇతరపార్టీల నాయకులు ప్రభుత్వాన్ని నడపకుండా ఎన్ని అడ్డంకులు సృష్టించినా భయపడే ప్రసక్తిలేదని స్పష్టంచేశారు. అలాగే రాబోయేరోజుల్లో కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మగృహాలు బ్రహ్మాండంగా నిర్మించి నిరుపేదలకు అందివ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పిసిసి కార్యవర్గ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిన్నారంబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిన్నారం మండల అధ్యక్షుడు వడ్డే కృష్ణ, శివానంద్, పడమటి మహిపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, గోరెమియ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో సేవాదృక్పథం పెంపొందించాలి

ఘట్‌కేసర్, జనవరి 11, ప్రభాతవార్త: విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవాదృక్పథాన్ని పెంపొందించాలని పాలకూర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలోని డిల్లీ పబ్లిక్ స్కూల్ 6వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వార్షికోత్సవంలో ఎమ్మెల్యే యశస్విని ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. వివిధ అంశాలలో ప్రదర్శించిన ప్రతిభ విద్యార్థులకు ఆమె చేతుల మీదుగా అవార్డులను అందజేసి అభినందించారు. విద్యార్థులు నిర్వహించిన పలుసాంస్కృతికకార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. తెలంగాణ రాష్ట్రసంస్కృతిని ప్రతిభింభించే నృత్యం, ముగింపునృత్యం సమాజానికి సందేశమిచ్చేలా రూపొందించబడిందని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ శాస్త్రవేత్త డాక్టర్ యోగేశ్ కె.వర్మ, డిపిఎస్ చైర్మన్ రాఘవేంద్రరెడ్డి మచ్చ, ప్రిన్సిపాల్ నీతుగుప్తాపూరి, డైరక్టర్లు సింగిరెడ్డి విజయ్‌పాల్‌రెడ్డి, రాధికారెడ్డి, పాలకమండలి సభ్యులు, టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 26 నుంచి రైతుభరోసా అమలు

ఘట్‌కేసర్, జనవరి 11, ప్రభాతవార్త: రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధిపథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వచీఫ్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్‌పరిధిలో శనివారం రూ.2.20కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. బాలాజీనగర్‌లో ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్‌తో కలిసి పలు చోట్ల సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు కొబ్బరికాయలు కొట్టి శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్‌బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిళ్ల ముత్యాలుయాదవ్, కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, కొమ్మగోని రమాదేవి, బొక్క సంగీత, బండారి అంజనేయులు, కొమ్మిడి అనురాధ, నస్రీన్‌సుల్తానా, సల్లూరి నాగజ్యోతి, బర్ల శశికళ, కడుపొల్ల మల్లేశ్, మేకల పద్మారావు, షేక్‌జహంగీర్, బండారి వసంత, బత్తుల నరేశ్‌యాదవ్, బేతాల నర్సింగ్‌రావు, కుతాడి రవీందర్, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ మెడబోయిన వెంకటేశ్, మాజీ ఎంపిటిసి చిల్కూరి గోపాల్‌రెడ్డి, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు కొరుబోతు నాగరాజు, మాజీ మాజీ ఉపసర్పంచ్ వేముల పరమేశ్‌గౌడ్, వార్డుసభ్యులు బర్ల దేవేందర్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, మీసాల సుధాకర్‌రావు, వెంకటనారాయణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, నాయకులు కేశవపట్నం అంజనేయులు, శశిధరణ్, బొక్క సత్తిరెడ్డి, నార్ల మల్లేశ్, సాయిచరణ్‌రెడ్డి, యాదగిరి, శివయ్య, రఫీక్, శ్రీనివాస్, ఆశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అధ్యయనోత్సవాలు ప్రారంభం

## కుడారై ఉత్సవం

**ఘట్‌కేసర్, జనవరి 12, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాపమేతమన్నార్ రంగనాయకస్వామి దేవస్థానంలో శనివారం కుడారై ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఆలయ ధర్మకర్తలు, వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు విచ్చేసి కుడారై ఉత్సవాని న్ని తిలకించి స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. పాల్గొన్న భక్తులకు అర్చకులు గంగాలంలు ప్రసాదంగా అందజేశారు. సోమవారం నమ్మాళ్వార్ పరమపదోత్సవం నిర్వహించనున్నట్లు ధర్మకర్తలు తెలిపారు. ఈనెల 14న ఆలయంలో శ్రీగోదారంగనాయక స్వామి కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.